ఏళ్ల నాటి కల సాకారం

- రూ.కోటితో నాలుగు కమ్యూనిటీహాళ్ల నిర్మాణం
- గత టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపనతోనే సరి
- సామాజిక భవనాల నిర్మాణంతో పెరిగిన ఆత్మగౌరవం
- హర్షం వ్యక్తంచేస్తున్న స్థానికులు




పశ్చిమ ఇబ్రహీంపట్నంలో ముస్లింలకు ప్రభుత్వం నిర్మించిన షాదీఖానా భవనం : ఇబ్రహీంపట్నం ప్రసాద్ నగర్‌లో ఎస్సీలకు నిర్మించిన కమ్యూనిటీహాల్

ఇబ్రహీంపట్నం: శుభ కార్యక్రమమైనా, మరే ఇతర కార్యక్రమమైనా జరుపుకోవాలంటే వేలాది రూపాయలు ఖర్చుచేసి కల్యాణ మండపాలు బుక్ చేసుకునే స్తోమత వారికి లేదు. ప్రభుత్వం కమ్యూనిటీహాళ్లు నిర్మిస్తే వాటిలో శుభకార్యక్రమాలు జరుపుకోవాలనేది వారి కల. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఏళ్లు గడుస్తున్నా వారి కల నెరవేరలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారి కలను సాకారం చేసింది. కొండపల్లి మున్సిపాల్టీలో బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలకు ప్రభుత్వం నిర్మించిన సామాజిక భవనాలు వారి ఆత్మగౌరవాన్ని పెంచాయి. నాలుగేళ్ల కిందట మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉన్న ఇబ్రహీంపట్నం, కొండపల్లి గ్రామాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మున్సిపాల్టీగా ఏర్పాటు చేసింది. సుమారు 67 వేల మంది జనాభా కలిగిన మున్సిపాల్టీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సామాజిక అవసరాల కోసం ప్రభుత్వం వీటిని నిర్మించింది. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై చిన్నచూపుతో భవన నిర్మాణాలు అటకెక్కించింది. ఆయా సామాజిక వర్గాల కోరిక మేరకు రూ.కోటి ఎంపీ నిధులతో భవన నిర్మాణాలు పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చారు.

షాదీఖానా నిర్మాణంతో ముస్లింల హర్షం

పశ్చిమ ఇబ్రహీంపట్నంలో ముస్లిం సామాజిక వర్గం షాదీఖానా (సామాజిక భవనం) నిర్మాణానికి ఎన్నో ఏళ్లుగా ఎదురు చూశారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ముస్లింలకు న్యాయం జరగలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావు షాదీఖానా నిర్మాణానికి భూమి పూజ చేసి భవన నిర్మాణం చేయకుండా ముస్లింలను మోసం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లింలకు షాదీఖానా నిర్మాణం చేసింది. ముస్లిం ఏరియాకు అనువుగా అత్యంత విలువైన స్థలంలో రూ.25 లక్షలతో నిర్మాణం చేశారు. ముస్లింల కల సాకారం కావడంతో హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ, బీసీ ప్రాంతాల్లో మూడు భవనాలు

ఎస్సీ, బీసీ సామాజిక వర్గం ఎక్కువగా ఉండే ప్రసాద్ నగర్, ఆర్టీసీ కాలనీ, కొండపల్లి పుట్లమ్మగట్టు ప్రాంతంలో రూ.75 లక్షలతో మరో మూడు భవనాలను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వం నిర్మించిన కమ్యూనిటీహాళ్లు బడుగు, బలహీన వర్గాల సామాజిక వికాసం, ఆత్మగౌరవానికి దోహద పడ్డాయి. సామాజిక పరమైన శుభకార్యాలు జరుపుకునేందుకు ఈ భవనాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. గత ప్రభుత్వంలో వీరు ఏ కార్యక్రమం జరుపుకోవాలన్నా వీధులు బ్లాక్ చేసి రోడ్లపైనే నిర్వహించుకోవాల్సి వచ్చేది. వీధులు బ్లాక్ చేయడంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఆ అవసరం లేకుండా దర్జాగా సామాజిక భవనాల్లో అన్నిరకాల కార్యక్రమాలు చేసుకుంటున్నారు.

ప్రజలను మోసం చేసిన టీడీపీ నేతలు

టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు బీసీలకు కల్యాణ మండపం కడతానని, ముస్లింలకు షాదీఖానా నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఏ ఒక్కటీ నిర్మించకుండా ఆయా సామాజిక వర్గాలను దారుణంగా మోసం చేశారు. అట్టహాసంగా భూమిపూజ చేసినా షాదీఖానా నిర్మాణం చేయకుండా కాలం గడిపేశారు. ఆయా సామాజిక వర్గాల వారు అప్పటి ప్రభుత్వ తీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.



వైఎస్సార్ సీపీతోనే సామాజిక న్యాయం

ప్రసాద్‌నగర్, ఆర్టీసీ కాలనీ, కొండపల్లిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సామాజిక భవనాలు నిర్మించడం అభినందనీయం. గతంలో ఏ కార్యక్రమం అయినా జరుపుకోవాలంటే రోడ్లు బ్లాక్ చేయాల్సి వచ్చేది. దీని వలన ఇతరులు ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం కమ్యూనిటీహాళ్లు నిర్మించడం వలన ఇబ్బందులు తప్పాయి. సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం.

– రాయపూడి వెంకటరావు, ఇబ్రహీంపట్నం



దశాబ్దాల కల సాకారమైంది

దశాబ్దాలుగా షాదీఖానా నిర్మాణం కోసం ఎదురు చూశాం. ప్రభుత్వాలు ఎన్ని మారినా ముస్లింలకు చేసిందేమీలేదు. గత ప్రభుత్వంలో షాదీఖానా నిర్మాణానికి భూమిపూజ చేసి నిర్మాణం మరిచారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం షాదీఖానా నిర్మాణం చేసి ముస్లింల పక్షపాతిగా నిలిచింది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– షేక్ జియావుల్ హక్, పశ్చిమ ఇబ్రహీంపట్నం

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరువూరు రోడ్డు, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, బ్యాంక్ స్ట్రీట్, ఎంప్లాయీస్ కాలనీ, జంక్షన్‌రోడ్డు, అమ్మవారితోట, మొఘల్ చెరువు ప్రాంతం, ఆర్‌ఆర్‌పేట, ఆటోనగర్, అయ్యప్పస్వామి గుడి ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

పోతనపల్లిలో 367 మందికి వైద్య సేవలు



చాట్రాయి: మండలంలోని పోతనపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, సాధారణ వ్యాధిగ్రస్తులు 367 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్‌మోహన్, తహసీల్దార్ మహ్మద్ మసూద్ ఆలీ, ఎంపీడీఓ మంగా కుమారి, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, దుర్గా ప్రసాద్, డాక్టర్లు పి.నిస్సీ (జనరల్), బెన్నీ మోజెస్ (ఆర్థోపెడిక్) పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడికి ఆశ్రయం



తిరువూరు: చిత్తూరు జిల్లా రేణిగుంటకు చెందిన బాలుడు తెలియక రైలు ఎక్కి విజయవాడ మీదుగా తిరువూరు చేరుకోగా అతనికి స్థానిక పరిపూర్ణ అనాథాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. నాగరాజు అనే పదేళ్ల బాలుడు రేణిగుంటలో రైలు ఎక్కి విజయవాడ చేరుకున్నాడు. అక్కడి నుంచి శుక్రవారం తిరువూరు వచ్చాడు. స్థానిక పోలీసులు బాలుడిని తల్లిదండ్రుల వద్దకు చేర్చేవరకు పరిపూర్ణ అనాథాశ్రమానికి తరలించారు.

సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

చాట్రాయి: పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, సబ్సిడీపై వీటిని అందజేస్తున్నామని వ్యవసాయ అధికారి శివశంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కావాల్సిన రైతులు తమ పేర్లను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ భూముల్లో రసాయన ఎరువులు విచ్చలవిడిగా వాడడం వల్ల భూసారం తగ్గి దిగుబడులు తగ్గుతున్నాయని చెప్పారు. పచ్చిరొట్టను భూముల్లో కలయదున్నడం వల్ల నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి సేంద్రియ పదార్థాల్ని భూమి గ్రహిస్తుందని చెప్పారు. విత్తనాలకు పేరు నమోదు చేసుకున్న రైతులకు 50 శాతం సబ్సిడీతో అందిస్తారని చెప్పారు. జీలుగ, జనుము కిలో రూ.44, పిల్లి పెసర కిలో రూ.67కి ఇస్తారని వివరించారు.

పరిసరాల పరిశుభ్రతతో డెంగీ నివారణ

పీహెచ్‌సీ వైద్యాధికారి సునందాకుమారి



దిగవల్లిలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

నూజివీడు: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా డెంగీ జ్వరాన్ని నియంత్రించవచ్చని దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి. సునందాకుమారి అన్నారు. జాతీయ డెంగీ నివారణ వారోత్సవాల సందర్భంగా మండలంలోని దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దోమకాటు వల్ల వచ్చే డెంగీ జ్వరంతో రక్తంలోని ప్లేట్‌లెట్లు పడిపోతాయని, శరీరంలోని వివిధ అవయవాల్లో తీవ్ర రక్తస్రావం జరిగే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఈ జ్వరం వచ్చినప్పుడు తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుకభాగంలో తీవ్రమైన కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, శరీరంపై దద్దుర్లు రావడం, వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. ఈ దోమ నివారణకు వారానికోరోజు ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో ఉండే కూలర్లను ఖాళీ చేయాలని, వాటిని శుభ్రం చేయాలని చెప్పారు. పరిసరాల్లో కొబ్బరిచిప్పలు, కుండపెంకులు, ఖాళీ గ్లాసులు, రోళ్లు, పాతటైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసుకుంటే దోమలను నివారించవచ్చన్నారు. వారానికి ఒక రోజు తప్పనిసరిగా డ్రై డే పాటించాలన్నారు. డెంగీ జ్వర లక్షణాలు కనిపించగానే వైద్యుడి వద్దకు వెళ్లాలన్నారు. సబ్ యూనిట్ అధికారి యలమంద, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం రక్తపోటు నివారణకు మార్గం



రక్తపోటు నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ముసునూరు: ప్రశాంత జీవనమే రక్తపోటు నివారణకు ప్రథమ సోపానమని వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్ అన్నారు. ప్రపంచ హైపర్ టెన్షన్ (రక్తపోటు) నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల్లో అవగాహన సభలు నిర్వహించారు. వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్ మాట్లాడుతూ మంచి ఆహారం తీసుకుంటూ, ఆందోళనలకు దూరంగా ఉంటే రక్తపోటు నివారించుకోవచ్చన్నారు. మన ఆహారంలో అధిక మొత్తంలో ఉప్పు వాడకాన్ని తగ్గించి, పండ్లు ఎక్కువగా తినాలని సూచించారు.
రక్తపోటును తొలి దశలోనే గుర్తించి జాగ్రత్త వహించాలన్నారు. రక్తపోటు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో వైద్యాధికారులు కరీముల్లా, అవినాష్, సూపర్‌వైజర్లు మురళి, అలెగ్జాండర్, అర్జునరావు, కృష్ణారావు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం



తిరువూరులో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

తిరువూరు: శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘ భవనంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి చిత్రపటానికి సంఘ ప్రతినిధులు విశేషపూజలు, అభిషేకాలు చేశారు. కాలజ్ఞానం రాసిన వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత విశేషాలను సంఘ నాయకులు కుమార్‌రాజా, రాంబాబు వివరించారు. సభ్యులు చంద్రశేఖర్, రామయ్య, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. బైపాస్ రోడ్డు విఘ్నేశ్వరాలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాన్ని తిరువూరు మండల, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు.

- **విస్సన్నపేట:** స్థానిక సత్తుపల్లి రోడ్డులోని గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో స్వామి వారి ఆరాధనోత్సవం వీరబ్రహ్మేంద్ర స్వామి అన్నప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు దాగం సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగోజు సత్యనారాయణ, కందుకూరి మోహన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కల్పించి విద్యుత్ సిబ్బందిపై దాడి

విస్సన్నపేట: ఏపీసీపీడీసీఎల్ విస్సన్నపేట సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఏఈ విజయ్‌భాస్కర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న విస్సన్నపేట–తిరువూరు రోడ్డు తెల్లదేవరపల్లి గ్రామం మెయిన్ రోడ్డులో ఎస్టీ కాలనీ వద్ద 33/11 కేవీ లైన్ కింద ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిధి మధ్యలో ఉన్న చెట్టు కొమ్మలు, జంగిల్ క్లియరెన్స్ పనులను ఏఈతో పాటు సిబ్బంది, అనుబంధ సిబ్బంది చేస్తుండగా స్థానికుడైన బి. శ్రీను అడ్డుకున్నాడు. తన ఇంటి వద్ద చెట్టుకొమ్మలు నరికింది ఎవరు అంటూ దూషించి సిబ్బందిపై దాడి చేశాడు. ఈ దాడిలో అసిస్టెంట్ లైన్‌మెన్ చలమాల మధుకు తీవ్రగాయాలు కావడంతో విస్సన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సిబ్బంది విధులకు ఆటకం కల్పించడంతో పాటు దాడి చేసిన నిందితుడు శ్రీనుపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో ఏఈ కోరారు.

స్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి తిరు కల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్నిశాఖల అధికారులతో నందిగామ ఆర్డీఓ ఎ.రవీంద్రరావు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించే కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ నెల 22న అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో చలువ పందిళ్లు, టెంట్‌లు, మజ్జిగ, తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. కృష్ణానదిలో భక్తులు స్నానమాచరించే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. నదిలో నీరు తక్కువగా ఉండటంతో నీటిపారుదల శాఖాధికారులు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కింగ్ ఏర్పాటుకు సమీపంలోని స్థలాన్ని వినియోగించుకోవాలని చెప్పారు.
ఈ ప్రాంతంలోని కర్మాగార యాజమాన్యాలు కూడా భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు రావాలని కోరారు. గతేడాది ఉత్సవాల సందర్భంగా భక్తులకు కలిగిన అసౌకర్యాన్ని విలేకరులు ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లగా, ఈసారి అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పా ట్లు చేస్తామని వివరించారు. అనంతరం తిరు కల్యాణోత్సవాల పోస్టర్‌ను ఆర్డీఓ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల య ఈఓ హేమల తాదేవి, డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, సీఐ జానకిరామ్, సర్పంచి గుడారు పేరయ్య, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఫైర్, ఆర్టీసీ, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖాధికారుల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న మోనిషా

ఎ.కొండూరు: రైతులు వ్యవసాయ శాఖాధికారుల సూచనలు పాటించాలని జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు పి. మోనిషా అన్నారు. చీమలపాడు గ్రామ సచివాలయంలో శుక్రవారం రైతులకు జిల్లా వనరుల కేంద్రం విజయవాడ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మోనిషా మాట్లాడుతూ ఈ నెలలో రైతులు తమ పొలాల్లో పశువుల ఎరువు లేదా గొర్రెల ఎరువును చల్లుకోవాలన్నారు. భూసారాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగు, పిల్లిపెసర విత్తనాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సాగుకు ముందు సేంద్రియ ఎరువులతో పాటు పచ్చిరొట్ట పైరును వేసి పూత దశలో భూమిలో కలిపి దున్నాలని చెప్పారు. దీని వల్ల కలుపు, పురుగులు భూమిలోని వ్యాధి కారక శిలీంద్రాలు ఎండవేడికి నశిస్తాయని వివరించారు. వీహెచ్ఏ వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

22న మండల పరిషత్ సమావేశం

విస్సన్నపేట: మండల పరిషత్ సాధారణ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ జి.విజయకుమారి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి సంబంధిత సభ్యులు హాజరు కావాలని కోరారు.

మల్లేలలో పోలీసుల కవాతు



మల్లేల(తిరువూరు): జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగే వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడవద్దని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ కోరారు. మండలంలోని మల్లేలలో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ జనజీవనానికి విఘాతం కలిగించే విధంగా ఎవరూ ప్రవర్తించవద్దని, సభలు, సమావేశాలు నిర్వహించడానికి ఎటువంటి అనుమతులూ లేవని అన్నారు. సర్కిల్ పరిధిలోని సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ

తిరువూరు: తిరువూరు పట్టణంలో శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ప్రభుత్వాస్పత్రిలో రోగిని పరామర్శించేందుకు వచ్చిన ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన రామకృష్ణ హ్యాండిల్ లాక్ వేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఎస్ఆర్ టవర్స్ సెంటర్‌లోని దంత వైద్యశాలకు వచ్చిన అనిల్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సచివాలయం పరిశీలన

జయంతి(వీరులపాడు): గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శివపార్వతీ ఆదేశించారు. మండలంలోని జయంతి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. ముఖ్యంగా ఆయా సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజలతో సానుకూలంగా స్పందించాలని సూచించారచు. ఉద్యోగుల పని తీరుపై ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఉద్యోగుల పని తీరు, సచివాలయంలో అందుతున్న సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

67.4 మి.మీ. వర్షపాతం నమోదు

తిరువూరు: తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో గురువారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. తిరువూరు మండలంలో 24 మిల్లీ మీటర్లు, గంపలగూడెంలో 8.2, విస్సన్నపేటలో 11, ఎ.కొండూరులో 14.2, రెడ్డిగూడెంలో 10 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తిరువూరు డివిజన్‌లో 67.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు.

అక్రమ కట్టడాల తొలగింపు

నందిగామ: పట్టణ పరిధిలో అక్రమ కట్టడాలు, లేఅవుట్లను తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. పట్టణ పరిధిలో నిర్మిస్తున్న పలు అక్రమ కట్టడాలను శుక్రవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అనుమతుల మేరకే నిర్మాణాలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి తగిన అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు జరిపినా, అనధికారిక లే అవుట్‌లు వేసినా వాటిని తొలగించడంతోపాటు నిర్మాణదారుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనవసరంగా అక్రమ కట్టడాల నిర్మాణాలు చేసి నష్టపోవద్దని సూచించారు. ఇప్పటికే పలువురికి నోటీసులు ఇవ్వడం జరిగిందని, అయినా కొందరు అక్రమ కట్టడాలు చేపడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది ద్వారా ప్రత్యేక నిఘా పెట్టడంతోపాటు ఆయా అనధికారిక, అక్రమ కట్టణాలను తొలగిస్తామని కమిషనర్ వివరించారు. అక్రమ కట్టణాల తొలగింపులో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం రైతులలో ఆందోళన

నందిగామ: నందిగామ ప్రాంతంలో రెండు రోజులుగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఉండటంతోపాటు చిరుజల్లులు కురుస్తున్నాయి. వాతావరణ శాఖాధికారులు వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో దాల్వా సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖాధికారుల లెక్కల ప్రకారం నందిగామ నియోజకవర్గంలో 3,165 ఎకరాల్లో రైతులు దాల్వా వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పలుచోట్ల కోతలు పూర్తి కాగా మరికొన్ని చోట్ల రైతులు హడావిడిగా యంత్రాల ద్వారా కోతలు చేపట్టారు. వరి కోతలు పూర్తిచేసుకున్న రైతులు ధాన్యం తడవకుండా ఉండేందుకు పట్టాలు కప్పి భద్రపరుచుకునే పనిలో నిమగ్నమయ్యారు.

'కలేకూరి'కి ఘన నివాళి



కంచికచర్ల : కవి, గేయ రచయిత, ఉద్యమకారుడు, అనువాదకులు కలేకూరి ప్రసాద్ 11వ వర్ధంతిని శుక్రవారం కంచికచర్లలో నిర్వహించారు. కంచికచర్లలోని ఆయన సమాధి వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రముఖ రచయిత తంగిరాల సోనీ మాట్లాడుతూ కలేకూరి జీవితం దళిత ఉద్యమాలకు, సాహిత్యం పీడితుల పక్షంగా ఉన్నాయన్నారు. ఆయన జీవితమంతా ఉద్యమం, సమాజమంటూ బహుజనుల మానవ సమాన, స్వేచ్ఛ, హక్కుల కోసం పోరాడారన్నారు. నేటికి ప్రజల గుండెల్లో ప్రజాకవిగా కలేకూరి ముద్ర వేసుకున్నాడని పేర్కొన్నారు. కలేకూరి కవితలు జనంలో ఉవ్వెత్తున ఎగసిపడే కెరటం లాంటివని అభివర్ణించారు. కార్యక్రమంలో వేల్పుల రమేష్ తంగిరాల సృజినీకుమార్, చట్టి రవీంద్ర, దగ్గుపాటి మనోహర్, తన్నీరు శ్రీనివాసరావు, బి. శంకరరావు, కర్ల రవికుమార్, బెజ్జం భూషణం, చట్టి రవీంద్ర, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.